క్లుప్తంగా

క్రమశిక్షణతో చదివితే విజయం మీదే



కొడవలూరు: క్రమశిక్షణతో కష్టపడి చదివితే విజయం మన సొంతమవుతుందని అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఫాల్సమ్ సిటీ వైస్ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడవలూరు మండలం మన్నధరావుపేట గ్రామానికి చెందిన తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, చదువుకొంటూ పనులకు వెళ్లేవాడినని, కూలీ పనికి వెళ్లి మొదటగా సంపాదించిన రూపాయి నోటును విద్యార్థులకు చూపించారు. తొలిసారిగా సంపాదించిన రూపాయి నోటును ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా భద్రపరచుకొన్నానని తెలిపారు. ఉన్నతస్థాయికి రావాలన్న తపనతో చదవాలని విద్యార్థులకు సూచించారు. గురుకుల ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ మాట్లాడుతూ ఉన్నతస్థాయిలో ఉన్న ఏడుకొండలు తమ విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశమిచ్చేందుకు పాఠశాలకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులంతా చదువుకొని ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్న ఆకాంక్షతో ఏడుకొండలు గతంలో గురుకులానికి సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు విరాళం ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చౌటూరు శీనయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శేషవాహనం బహూకరణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి శుక్రవారం దాతలు నూతన శేషవాహనాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన మునగా హనుమంతరావు జ్ఞాపకార్థం ఆయన భార్య వరలక్ష్మి, కుమారులు అనిల్‌కుమార్ – అలేఖ్య, ప్రవీణ్‌కుమార్ – హర్షిత దంపతులు స్వామి, అమ్మవార్లకు ఉత్సవ నిర్వహణ కోసం శేషవాహనాన్ని బహూకరించారని తెలిపారు. అర్చకులు ఈ సందర్భంగా వాహనానికి సంప్రోక్షణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, రఘురామయ్య, కామేశ్వరి, సుప్రజ, పద్మ, విమల, విజయమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

30 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కొడవలూరు : అక్రమంగా తరలిస్తున్న 30 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల డీటీ కృష్ణప్రసాద్ పట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని చంద్రశేఖరపురంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. చంద్రశేఖరపురంలోని ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాము నుంచి 30 బస్తాల రేషన్ బియ్యం ట్రక్ ఆటోలో అక్రమంగా తరలిస్తూ హైవే మీదకు రాగానే డీటీ కృష్ణ ప్రసాద్ గుర్తించారు. వెంటనే ఆటోతో సహా బియ్యాన్ని సీజ్ చేశారు. ట్రక్ ఆటో యజమాని శింగంశెట్టి హరీష్, డ్రైవర్ పి.మధుసూదన్‌రావులపై 6–ఏ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన ఆటోను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి బియ్యాన్ని కోవూరులోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. సీజ్ చేసిన ట్రక్ ఆటోతో సహా బియ్యం విలువ రూ.2,55,550 ఉంటుందని డీటీ తెలిపారు. పేదలకు ఇవ్వాల్సిన బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలించి లాభపడడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రతి కూలీకి రూ.257 గిట్టుబాటు కావాలి

పొదలకూరు: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు వచ్చే ప్రతి కూలీకి సగటున రూ.257 కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ సూచించారు. పొదలకూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొదలకూరు చెరువు సప్లయ్ చానల్ పనులు చేస్తున్న కూలీలతో పీడీ మాట్లాడారు. టీఏలు, ఎఫ్‌ఏలు కూలీలకు రూ.257 కూలి వచ్చేలా పనులను చేయించాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామంలో కూలీలు ఉన్నారని, వారిని పనులకు పురమాయించాలని సూచించారు. ప్రస్తుతం పనులకు హాజరవుతున్న కూలీలకు రూ.235 గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు.

దేగపూడిలో ఏపీడీ తనిఖీ

మండలంలోని దేగపూడి గ్రామంలో డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి ఉపాధి హామీ పనులను శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామంలో కాలువ పూడిక తొలగింపు పనులను కూలీలు చేస్తుండగా పరిశీలించి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ సగటున రూ.210 మాత్రమే కూలీలకు గిట్టుబాటు అవుతున్నట్లు తెలిపారు.

శ్రీధర్‌రెడ్డి మహానటుడు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) / నెల్లూరు(సెంట్రల్): సినిమాల్లో ఉంటే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎస్వీ రంగారావు, కోట శ్రీనివాసరావును మైమరపించేవారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నగరంలోని 54వ డివిజన్లో గల భగత్‌సింగ్ కాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. ఆనం వివేకానందరెడ్డి తనకు గతంలో ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఆయనకు ద్రోహం చేశానంటూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రకరకాలుగా మాట్లాడారని చెప్పారు. ఆ సమయంలో తాము కాంగ్రెస్ పార్టీలో ఉన్నామని గుర్తుచేశారు. వైఎస్సార్ మరణానంతరం దాదాపు 60 లక్షల మంది నేతలు, కార్యకర్తలు, ప్రజలు 45 శాతంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని రెండు శాతానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎంతో మంది భావోద్వేగానికి గురై ఓ ఉప్పెనగా జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపారని.. అందులో తాను.. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డీ ఉన్నామన్నారు. ఆనం వివేకానందరెడ్డి ఇంటిపైకి దాడికెళ్లిన ఘటన ఎక్కడా లేకపోయినా.. తనపై అనవసరంగా మాట్లాడారని ధ్వజమెత్తారు. పార్టీ నుంచి వెళ్లాలనుకుంటే నిందలు మోపకుండా హుందాగా వెళ్లాలని మాత్రమే చెప్పానని, దీనికి సంబంధించి ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టడం సమంజసం కాదని హితవు పలికారు. 51 సెకన్ల వీడియోలో ఏముందని ప్రశ్నించానని.. దీనికి సమాధానం చెప్పకుండా రకరకాలుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ సఫియా, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ, క్యాలెండర్లను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సెక్రటరీ శివయ్య ఆధ్వర్యంలో మంత్రిని సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులకు డైరీ, క్యాలెండర్లను అందజేశారు. నేతలు కోటేశ్వరరావు, సురేంద్రరెడ్డి, సాంబశివరావు, సురేష్‌బాబు, షరీఫ్, కార్తీక్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కళా తపస్వికి ఘన నివాళి



నెల్లూరు(బృందావనం): తెలుగు సినీ పరిశ్రమకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన దర్శకుడు కళా తపస్వి విశ్వనాథ్ మరణం తీరనిలోటని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనకు భారతరత్నను ప్రకటించాలని కోరారు. హరిబాబు, హరనాథ్‌రెడ్డి, భాస్కర్, మధు, రామ్‌ప్రసాద్, వెంకటేష్, రాజు, చిట్టిబాబు, నారాయణబాబు, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కళా నివాళి



నెల్లూరు(బృందావనం): హరనాథపురానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు పద్మారత్నం కళా తపస్వికి కళానివాళి అర్పించారు. మెర్క్యురీ బాల్‌పై ఆయన సూక్ష్మరూపాన్ని అర సెంటీమీటర్ పరిధిలో తీర్చిదిద్దారు. చిత్రరంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

పోక్సో కేసులపై సమీక్ష

నెల్లూరు(క్రైమ్): పోక్సో కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఏఎస్పీ హిమవతి ఆదేశించారు. పోక్సో కేసులపై నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఆమె సమీక్షించారు. కేసుల నమోదు, దర్యాప్తు, కోర్టులో అభియోగపత్ర దాఖలు, నిందితులకు శిక్ష, తదితర అంశాలపై పలు సూచనలు, సలహాలిచ్చారు. పలు కేసుల పెండెన్సీకి గల కారణాలను ఆరాతీసి.. వాటి పరిష్కారానికి గానూ దిశా నిర్దేశనం చేశారు.

క్రైమ్ కార్నర్

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన ఘటనలో దిశ మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొగతోటకు చెందిన సుప్రియకు తూర్పుగోదావరి జిల్లా కొత్తపేరుమాళ్లపురానికి చెందిన సాంబశివ వరప్రసాద్‌తో 2015లో వివాహమైంది. ఆ సమయంలో సుప్రియ తల్లిదండ్రులు రూ 1.8 కోట్ల నగదు, 3.3 కిలోల బంగారు, నాలుగు కిలోల వెండి ఆభరణాలు, రెండు కార్లను కట్నం కింద వరప్రసాద్ కుటుంబసభ్యులకు ఇచ్చారు. సుప్రియ దంపతులకు ఒక పాప పుట్టింది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటి వారు ఆమెను అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా హింసించసాగారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు కట్నం కోసం తనను చంపేందుకు యత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై శేఖర్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు ప్రశ్నించిన ఆమెపై దౌర్జన్యం చేసిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వేదాయపాళెంలోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన విజయలక్ష్మికి తెలుగంగకాలనీలోని విజయలక్ష్మినగర్ వద్ద కొంత స్థలం ఉంది. సదరు స్థలాన్ని నగరానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి, కోటయ్య, పద్మయ్య మరికొందరు ఆక్రమించుకున్నారు. ఇదేమని ప్రశ్నించిన విజయలక్ష్మిపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



నెల్లూరు(క్రైమ్): గూడ్స్ రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరెంటాఫీస్ గేట్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు 65 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు కలిగి.. లేత పచ్చ రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ, గ్రే, తెలుపు రంగు గళ్ల లుంగీ, నలుపు రంగు పారగాన్ చెప్పులను ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాలోని నగదు మాయం

నెల్లూరు(క్రైమ్): ఖాతాదారుడికి తెలియకుండా అతని అకౌంట్‌లోని నగదు మాయమైన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటకు చెందిన గోపాల్‌రావుకు మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో అకౌంట్ ఉంది. ఆయనకు తెలియకుండా గతేడాది నవంబర్, డిసెంబర్‌లో రెండు దఫాలుగా రూ.3.45 లక్షలు గుర్తుతెలియని ఖాతాలకు బదిలీ అయ్యాయి. తన ఖాతాలోని నగదు కట్ అయిన విషయాన్ని గమనించిన ఆయన బ్యాంక్‌కు వెళ్లి పరిశీలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహకొండలో వేలం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వేలాన్ని శుక్రవారం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, కొబ్బరి చిప్పలు, తలనీలాల సేకరణ, పుష్పాల సరఫరా, కల్యాణ మండప నిర్వహణ, తదితరాలకు సంబంధించిన వేలాన్ని దేవదాయ శాఖ అధికారి సుధీర్ ఆధ్వర్యంలో జరిపారు. రూ.54,49,100 మేర ఆదాయం లభించింది. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, దేవరపాళెం సర్పంచ్ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా వేణుగోపాల్



నెల్లూరు (టౌన్): సంతపేటలోని ప్రభుత్వ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా వేణుగోపాల్ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. పార్వతీపురంలోని గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం బీఈడీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా ఆర్జేడీ సుబ్బారావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. నూతన ప్రిన్సిపల్ వేణుగోపాల్‌ను కళాశాలలోని అధ్యాపకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

మహాసభలకు తరలిరావాలి



మాట్లాడుతున్న పెంచలరెడ్డి

నెల్లూరు(అర్బన్): కర్నూల్లో ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, ఏపీ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్లోని ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ సమస్యలపై చర్చించి వాటి సాధనకు కార్యాచరణను రూపొందించనున్నారని వివరించారు. ఏపీ జేఏసీ అమరావతి జిల్లా సెక్రటరీ జనరల్ చెంచురామయ్య, నేతలు సురేష్‌బాబు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



నెల్లూరు(క్రైమ్): ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భాస్కర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. కోవూరుకు చెందిన భాస్కర్ 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరారు. అనంతరం సివిల్ కన్వర్షన్ పొందారు. ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన కొంతకాలంగా మధుమేహం, బీపీ, తదితర వ్యాధులతో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతికి ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రావు, రాష్ట్ర గౌరవ సలహాదారుడు శ్రీహరి సంతాపం ప్రకటించారు. పోలీస్ లాంఛనాలతో భాస్కర్ అంత్యక్రియలు కోవూరులో శనివారం జరగనున్నాయని తెలిపారు.

ఆశ వర్కర్లపై వేధింపులను ఆపాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): వైద్య శాఖలో ఆశ వర్కర్లపై వేధింపులను ఆపాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ కోరారు. ఈ మేరకు సంతపేటలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోశాధికారి మధుసూదన, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీలోనే కొనసాగుతాం



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: తాను, తన డివిజన్లోని నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని 22వ డివిజన్ కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీ నిర్ణయించిన వ్యక్తి విజయానికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం కార్యాలయంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫ్లెక్సీలను తొలగించారు.

కిడ్నాప్‌నకు యత్నించారు

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తాను వీడలేదనే అక్కసుతో కిడ్నాప్‌నకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యత్నించారని కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు పార్టీ నేతలతో కలిసి శుక్రవారం ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీని వీడి తనతో పాటు రావాలని ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చారన్నారు. అయితే తిరస్కరించినందుకు గానూ ఆయన అనుచరుడు, డ్రైవర్‌తో కలిసి కిడ్నాప్‌నకు యత్నించారని, వారి నుంచి తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ప్రాణం ఉన్నంత వరకూ జగనన్నతోనే..

ప్రాణం ఉన్నంత వరకూ జగనన్నతోనే ఉంటానని విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ద్వారానే కార్పొరేటర్ పదవి వచ్చిందని.. జగనన్న ఇచ్చిన బీ ఫారంతో గెలిచానని పేర్కొన్నారు. తన ద్వారా వచ్చిందని ఎమ్మెల్యే అనుకుంటే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసేందుకైనా వెనుకాడేదిలేదని స్పష్టం చేశారు.

నాపై వ్యాఖ్యలు విచారకరం



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, మంత్రులు తనపై చేస్తున్న వ్యాఖ్యలు విచారకరమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే మనస్తాపంతో పార్టీ నుంచి బయటకొచ్చానని, ఎవరిపైనా బురదజల్లడం తన నైజం కాదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు రెండు సార్లు టికెట్ కేటాయించడం.. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు. తాను నమ్మక ద్రోహిగా మాట్లాడుతూ.. తన కూతుళ్లకు ఆ శాపం తగులుతుందంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ విమర్శించడం బాధాకరమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాదీమంజిల్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న ఫయాజ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోటమిట్టలో నూతనంగా నిర్మించిన షాదీమంజిల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నగర ఇన్‌చార్జి ఫయాజ్ కోరారు. కోటమిట్టలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నేతలు ఫజులుద్దీన్, మున్నా, మహ్మద్ బాషా, ముజీబ్, గౌస్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీకి అవార్డు



నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలోని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీకి జాతీయ స్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్‌లో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డును సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్ తనయుడు వినయ్ విశ్రాంత సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా అందుకున్నారు.

గిరిజన కుటుంబాలకు ఆధార్ నమోదు



నెల్లూరు రూరల్: దొంతాలి డంపింగ్ యార్డు వద్ద నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాలకు ఆధార్‌ను శుక్రవారం నమోదు చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడి గిరిజనులకు నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాణి మాట్లాడారు. గిరిజనులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఏ పథకం పొందాలన్నా ఆధార్ తప్పనిసరని చెప్పారు. పిల్లల చదువుకు అవసరమైన సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.